విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell:9247819181,
8309605189

TITLE Code TEL TEL12230

మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల శుక్రవారం 31 మే 2024 పేజీలు : 4 వేల : రూ.2

కొత్త లోగో ఆవిష్కరణ వాయిదా

హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణ కొత్త లోగో దాదాపు ఖరారయ్యిందని గత 24 గంటలుగా హడావుడి జరిగిన సంగతి తెలిసిందే. అదిగో ఇదిగో రిలీజ్ అంటూ కాంగ్రెస్ నేతల మాటలు.. ఇక సోషల్ మీడియాలో అయితే ఇదిగో ఇదే ఫైనల్ అని ఫొటోలు తెగ వైరల్ అయ్యాయి. జూన్-02న కాకుండా మరో రోజున రిలీజ్ చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దీనిపై ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే.. తెలంగాణ గీతం మాత్రమే జూన్-02నే విడుదల చేస్తారని తెలుస్తోంది. అయితే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, తెలంగాణ ప్రజల్లో ఓ వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతతో ప్రభుత్వం పునరాలోచనలో పడిందనే టాక్ కూడా గట్టిగానే నడుస్తోంది. కొత్త లోగోలో కాకతీయ తోరణం, చార్మినార్ స్థానంలో అమరవీరుల స్థూపానికి రేవంత్ రెడ్డి సర్కార్ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైన మూడు సింహాల లోగోను పైభాగంలో పొందుపరిచినట్లు కొన్ని చిత్రాలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ లోగోనే రేవంత్ ప్రభుత్వం దాదాపు ఖరారు చేసిందని వార్తలు గుప్పుమన్నాయి. మొత్తం 40కిపైగా డిజైన్లను కాంగ్రెస్ సర్కార్ పరిశీలించగా.. ఒక్కటి మాత్రం ఫైనల్ చేసిందని టాక్. మరో రెండు రోజుల్లో అవతరణ ఉత్సవాల నేపథ్యంలో రిలీజ్ చేయాలని నిర్ణయించినప్పటికీ వాయిదా వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడం జరిగింది.

దంచికొడుతున్న ఎండలు..

- జూన్ ఒకటి నుంచి మూడురోజుల పాటు వర్షాలు
- వర్షాలపై కీలక అప్‌డేట్ ఇచ్చిన వాతావరణశాఖ..!

హైదరాబాద్ : తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. వర్షాలు ముఖం చాటేయడంతో ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మళ్లీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. జూన్ ఒకటిన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే, 2వ తేదీ నుంచి 3వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పింది. మరో వైపు నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. రుతుపవనాలు లక్షద్వీప్ ప్రాంతం మీదుగా కేరళలోకి ప్రవేశించాయని పేర్కొంది. రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని భాగాలు, నైరుతి, మధ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, సిక్కింలోని పలు ప్రాంతాల్లోకి రాబోయే రెండుమూడు రోజుల్లోనే విస్తరిస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

45 గంటల ధ్యానంలో నరేంద్ర మోదీ...



మన వార్త:లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గత 75 రోజులుగా విరామం లేకుండా ప్రచారం కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇక ప్రచారం ముగించి, విశ్రాంతి .గత 75 రోజులుగా 180 ర్యాలీలు, లెక్కలేనన్న సభల్లో పాల్గొన్న ఆయన.. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సమయం ముగిసిపోవడంతో.. గురువారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు అంటే.. 45 గంటల పాటు ధ్యానం చేయనున్నారు. ఎన్నికల హడావిడి నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1తో లోక్ సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి అవుతుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతాయి. ఈ గ్యాప్‌లో మోదీ తనకు అలవాటు అయిన ధ్యానంలో గడిపేందుకు ఇష్టపడుతున్నారు.అయితే.. ఈ 45 గంటల ధ్యానం కోసం ఆయన ఒక ప్రత్యేకమైన స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌లో ఆయన ధ్యానంలో కూర్చోనున్నారు. అయితే.. ఈ ప్లేస్‌కు చాలా ప్రాముఖ్యత ఉంది. ఇప్పుడు ప్రధాని మోదీ ధ్యానం కోసం కూర్చోబోయే ప్లేస్‌లోనే స్వామి వివేకనందా కూడా ధ్యానం చేసినట్లు చరిత్ర చెబుతోంది. తత్వవేత్త, రచయిత, ఆధ్యాత్మిక వేత్త అయిన స్వామి వివేకనందుడి గురించి అందరికి తెలిసిందే. ఆయన 1892లో కన్యాకుమారి తీరం నుంచి ఒక ద్వీపానికి ఈదుకుంటూ వెళ్లి అక్కడ మూడు రోజులు ధ్యానం చేసి, జ్ఞానోదయం పొందారు. అదే వివేకానంద రాక్ మెమొరియల్ అయింది. ఇప్పుడు ప్రధాని మోదీ కూడా అదే ప్లేస్‌లో వివేకానంద ధ్యానం చేసిన ప్లేస్‌లోనే 45 గంటల పాటు ధ్యానంలో కూర్చోనున్నారు.

పిల్లలు జాగ్రత్త..

- హైదరాబాద్‌లో తిరుగుతున్న బూచోళ్లు
- ముఠాపై పక్కా నిఘా పెట్టిన పోలీసులు..
- దత్తత తీసుకోవాలనిపిస్తే.. చట్టబద్ధంగా తీసుకోవాలి
- అక్రమంగా కొనుగోలు చేయొద్దని పోలీసుల హెచ్చరిక



హైదరాబాద్ **మన వార్త** : హైదరాబాద్ కేంద్రంగా పిల్లల్ని విక్రయిస్తున్న ఓ ముఠాను పట్టుకుంటే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పిల్లలు లేని దంపతులే టార్గెట్‌గా కిడ్నాప్ ముఠాలు విచ్చలవిడిగా విజృంభిస్తున్నాయి. పేదలు, అమాయకుల పిల్లల్ని ఎత్తుకొచ్చి నిలువునా అమ్మేస్తున్నాయి కిడ్నాప్ ముఠాలు. తాజాగా హైదరాబాద్ మేడిపల్లి కేంద్రంగా పిల్లలను అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. ఢిల్లీ, పూణే నుంచి చిన్న పిల్లలను తీసుకొచ్చి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తోంది ఓ కిలాడీ ముఠా. 3 నెలల పసికందుల నుంచి ఏడాది పిల్లల వరకు విక్రయిస్తోందీ గ్యాంగ్. ఈ ముఠాపై పక్కా నిఘా పెట్టిన పోలీసులు.. 16 మంది చిన్నారులను కాపాడారు.శోభారాణి, స్వప్న,షేక్ సలీం సహా 11 మంది నిందితులు పిల్లల విక్రయ రాకెట్‌లో భాగమైనట్టు పోలీసుల విచారణలో తేలింది. పీర్జాదిగూడలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అడ్డాగా ఆర్ఎంపీ శోభారాణి ఎప్పటి నుంచో ఈ దందా నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. పిల్లలు లేనివారికి అక్రమంగా చిన్నారులను అమ్మేసి లక్షలకు దండుకుంటున్నారు. ఇప్పటివరకు 50 మందిని విక్రయించినట్టు విచారణలో తేలింది.కాపాడిన 16 మంది పిల్లలను వారి తల్లిదండ్రుల దగ్గరకు అప్పజెప్తుంటే.. కొనుగోలు చేసిన దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు పోసి కొన్నాం. పైగా ఇన్ని రోజులు మమకారంతో పెంచుకున్నాం మా పరిస్థితి ఏంటంటూ బోరున ఏడుస్తున్నారు.అయితే అక్రమంగా పిల్లలు కొన్నందుకు వాళ్ల మీద కూడా కేసులు నమోదు చేస్తున్నారు అధికారులు. ఎవరికైనా పిల్లలు లేకపోతే.. దత్తత తీసుకోవాలనిపిస్తే.. చట్టబద్ధంగా తీసుకోవాలి. అంతేగానీ ఇలా అక్రమంగా కొనుగోలు చేసి నేరాలకు పాల్పడొద్దంటూ హెచ్చరిస్తున్నారు పోలీసులు..

పత్తి విత్తనాల కోసం ధర్నా

ఆదిలాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో విత్తన సంక్షోభం నెలకొన్నది. విత్తనాల కోసం రైతుల వెతలు అన్నీ ఇన్నీ కావు. నిన్న మొన్నటి వరకు పచ్చిరొట్ట విత్తనాలనే పంపిణీ చేయలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. జనుము, జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు ఇవ్వలేని ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సరిపడా ఇస్తుందా ? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా పత్తి విత్తనాల కొరతపై రైతుల ఆగ్రహం వ్యక్తంగా చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా మూడో రోజు విత్తనాల కొరతతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు ఒక్కో రైతుకు రెండు ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. విత్తనాల పంపిణీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో రైతులు ధర్నా చేపట్టారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విత్తనాల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికా QR కోడ్‌ను
స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA

తెలంగాణ పీజీఈసెట్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్ మన వార్త : తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) 2024 పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదల అయ్యాయి. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలంగాణ పీజీఈసెట్ 2024 పరీక్ష జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్ష జరుగుతుంది. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుంది. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 12.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఈ ఏడాది జేఎన్‌టీయూ హైదరాబాద్ పీజీఈసెట్ పరీక్ష నిర్వహిస్తోంది. పీజీఈసెట్ 2024లో వచ్చిన ర్యాంకు ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అఫిలియేటెడ్ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్, గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మడీ, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కాగా తెలంగాణ ఈజీఈసెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు 120 మార్కులకు 2 గంటల్లో సమాధానాలు గుర్తించవల్సి ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు. ప్రవేశ పరీక్షలో మొత్తం మార్కుల్లో కనీసం 25 శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఉత్తీర్ణులుగా

వేములవాడలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి...

-ఆర్యవైశ్యుల అభివృద్దే లక్ష్యం...
-ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఇదే నా ఆహ్వానం...
-బుస్స శ్రీనివాస్ (ఎస్.ఆర్.ఆర్.కే ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం అధ్యక్షులు)


జై వాసవి !!
జై జై వాసవి !!
శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర
ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం, వేములవాడ
(రిజి.1977/87)
సత్రం శ్రేయోభిలాషులు, ఆర్యవైశ్య సంఘాల
"ఆత్మీయ సమ్మేళనము" స్వాగతం-సుస్వాగతం

వేములవాడ పట్టణంలో భాగంగా ఎస్.ఆర్.ఆర్.కే ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో తేది: 1-6-2024 శనివారం ఉదయం 11:00 లకు వాసవి కళ్యాణ మంటపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం వేములవాడలో ఘనంగా నిర్వహిస్తున్నామని కృషి రత్న బుస్స శ్రీనివాస్ (అధ్యక్షులు మరియు సత్ర కమిటి ఎస్.ఆర్.ఆర్.కే ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం వేములవాడ ,కాశి)పత్రిక ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రత్యేక అహ్వానితులుగా ఎమ్మెల్యే ధానుపాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ బోగారపు దయానంద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చేర్మేన్ కల్వ సుజాత, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ అది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ వస్తున్నారని తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీ లో నిర్మాణం చేసే భవనంలో విరాళాలు ప్రకటించిన సమాజ శ్రేయోభిలాషులు గది నిర్మాణ దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లా మరియు పట్టణ ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు,ఆర్యవైశ్య అభ్యుదయ, సంఘాల అధ్యక్షులు, మరియు సభ్యులు, సత్రం పాలక వర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ప్రతి ఒక్క ఆర్యవైశ్యులకు పేరుపేరునా ఇదేనా ఆహ్వానం అని తెలిపారు.ఈ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి వచ్చి విజయ వంతం చేయగలరని అన్నారు.

ఇంట్లో ఊరి వేసుకొని యువకుడు ఆత్మహత్య.

వేములవాడ, మే 30 (మన వార్త ప్రతినిధి నందు రావు):
కోనరావుపేట గ్రామంలో తీవ్ర విషాధం.రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో గురువారం రోజున ఇంట్లో ఎవరు లేని సమయంలో కొలకానీ కాషయ్య సరళ దంపతుల రెండవ కుమారుడు కొలకానీ నవీన్ 21 ఇంట్లో ఊరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.ఘటన స్థలానికి చేరుకున్నా పోలిస్ లు కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు యువకుని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది

స్తంభంపల్లి సాయిబాబా ఆలయంలో ఘనంగా పూజా కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమం

వేములవాడ మే 30 (మన వార్త ప్రతినిధి)
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో ఈరోజు సాయిబాబా ఆలయంలో ఘనంగా పూజా కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమ నిర్వహించామని గురూజీ డాక్టర్ శ్రీ శ్రీ శ్రీ దేవదాస్ స్వామి తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమం ప్రతి గురువారం నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని. గురూజీ తెలియజేశారు. ప్రతి గురువారం సుమారుగా 200 మందికి అన్నదాన కార్యక్రమం చేయడం జరుగుతుందని సాయిబాబా ఆలయ సభ్యులు రాములు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దెబ్బేటి ప్రవీణ్ పులి లక్ష్మీపతి గౌడ్ కమలాకర్ రెడ్డి గణేష్ కరుణాకర్ యాదగిరి దెబ్బేటి శ్రీనివాస్ బీరెల్లి ప్రవీణ్ కుమార్ ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సాయిబాబా ఆలయానికి విరాళాలు ఇవ్వాలనుకునే వారు గురూజీ డాక్టర్ శ్రీశ్రీశ్రీ దేవదాసు మరియు రామకృష్ణ సంప్రదించగలరని తెలిపారు మరియు గురువారం రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఈ అన్నదాన కార్యక్రమానికి 3500 విరాళంగా ఇచ్చినట్లయితే వారి పేరు మీద అన్నదానం మరియు అభిషేకం నిర్వహిస్తామని ఆలయ గురూజీ శ్రీ శ్రీ శ్రీ దేవదాసు స్వామి మరియు రామకృష్ణ తెలిపారు

బీసీ హాస్టల్ పున: ప్రారంభం పై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్...

-బీసీ హాస్టల్ ను పరిశీలించిన బిసి వెల్ఫేర్ అధికారులు
-సుదూర ప్రాంతా విద్యార్థులకు ఉపయోగం
-మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్

గంభీరావుపేట, మే30(మన వార్త ప్రతినిధి)
గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మార్చి 3 రోజున రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ని తన నివాసంలో కలిసి గంభీరావుపేట మండల కేంద్రంలో మూతబడి ఉన్న బీసీ హాస్టల్ ను పునః ప్రారంభించి సుదూర ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించడానికి వస్తున్న విద్యార్థులకు వసతి కల్పించి మెరుగైన విద్య కోసం పాటుపడాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ విషయంపై స్పందించిన మంత్రి రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్ కి వెంటనే విచారణ చేసి ఈ విద్యా సంవత్సరంలోనే బీసీ హాస్టల్ ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది. అందులో భాగంగా బీసీ హాస్టల్ ను పరిశీలించిన జిల్లా అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిని సంపూర్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంభీరావుపేట మండల కేంద్రంలోని మూతబడి ఉన్న బీసీ హాస్టల్ ను రాష్ట్ర బీసీ కమిషనర్ ఆదేశాలనుసారం బీసీ హాస్టల్ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ అక్కడికి చేరుకొని ఇక్కడ ఉన్నటువంటి ఇబ్బందులపై అధికారులకు వినతి పత్రం ఇచ్చి ఈ విద్యా సంవత్సరంలోనే బీసీ హాస్టల్ పునః ప్రారంభించాలని, ప్రస్తుతం హాస్టల్ భవనానికి రిపేర్ చేపించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మల్యాల రాజు వీర్,వాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి వద్ద డీసీఎంను ఢీకొన్న లారీ.. డ్రైవర్ కు తీవ్ర గాయాలు..

వేములవాడ, మే 30 (మన వార్త ప్రతినిధి):
వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద ఓ లారీ డీసీఎంను ఢీకొట్టింది దీంతో డీసీఎంలో ఉన్న డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోగా స్థానికులు డ్రైవర్ను అతి కష్టం మీద బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్- వేములవాడ ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కరీంనగర్ వెళ్తున్న లారీ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ఈ ప్రమాదం జరిగిందనీ స్థానికుల వెల్లడి.

మండల కేంద్రంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు...

కమలాపూర్ మే 30(మన వార్త ప్రతినిధి కళ్యాణ్)
హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రం లో తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలో బాగంగ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితెల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో పేషంట్స్ కి పండ్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, డా. మౌటం కుమారస్వామి, కంభంపాటి ప్రసాద్, రామ్ శెట్టి మధు, అశోక్ జి,కిన్నెర కృష్ణమూర్తి, మస్నా చంద్రశేఖర్,మాజీ వార్డు సభ్యులు పుల్ల ఐలయ్య , వెంగళ విజయ్ జన్ను రమేష్, వెంగళ శ్రీనివాస్, వెంగళ బిక్షపతి, వెంగళ రాజేష్, కిన్నెర గోపి, గంధసిరి అనిల్, వెలిశెట్టి శ్రీనివాస్, మాట్ల సాయికిరణ్ పాల్గొన్నారు.

వేములవాడ రాజన్నకు 'వెలిచాల 'పది లక్షల విరాళం..

వేములవాడ, మే 30 (మన వార్త ప్రతినిధి నందు రావు):
తెలంగాణలోనే ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం,దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు రూ.10లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసి ప్రచారంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాల యాన్ని కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. తాను దేవస్థానానికి ఉడతా భక్తిగా రూ.10 లక్షల రూపాయలు విరాళాన్ని అందిస్తానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారంఈ మేరకు బుధవారం రోజున వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ఆలయ అధి కారులకు రూ.10 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగాచెర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

పిసిసి పదవి అద్దంకి దయాకర్ కు ఇవ్వాలి

మల్కాజ్గిరి జిల్లా మే 31 (మన వార్త ప్రతినిధి: అంతోని)
మల్కాజ్గిరి జిల్లా అల్వాల్ అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటి సీఎల్.యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అద్యక్ష పదవి అద్దంకి దయాకర్ కే ఇవ్వలాని అణగారిన ప్రజల హక్కు ల పోరాట కమిటి,గద్దర్ అభిమాను ల సంఘం,జజ్జనక కళా మండలి, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘలు డిమాండ్ చేస్తున్నాయి. గత 6 మాసాలుగా తుంగతుర్తి ఎమ్మెల్యే టికెటు ఎమ్మెల్సీ గవర్నర్ కోటలో ఇస్తామని ఇవ్వలేదు.భువనగిరి ఎంపీ టికేటు ఇవ్వలేదు,మూడు సార్లు ఆశలు నిరాశలు చేశారు. అద్దంకి దయాకర్ లక్షలాది ప్రజల అభిమాన నాయకుడు, కాంగ్రేస్ పార్టీని బలో పేతం చేయుటలో ముందు వరసలో ఉన్నాడు,అదికార ప్రతినిదిగా టీవీ లలో చర్చలలో ప్రతిపక్షాలను మాట లతో చీల్చి చేండడుతాడు.ఇలాంటి నాయకునికీ ఎలాంటి పదవి ఇవ్వక పోవాడం ఎస్సీ ఎస్టీ ఓబీసీ బీసీ మైనార్టీ సంఘాల ఆత్మ గౌరవన్ని గాయపర్చి నట్లుగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాం.పరుగేత్తే గుఱ్ఱాన్ని ఉట్టిగా కట్టి పేట్టినట్లు ఉంది. కావున ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆలోచించి అద్దంకి దయా కర్ కు పిసిసి అద్యక్ష పదవి ఇవ్వాల ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.. సి.యల్.యాదగిరి, ప్రదానకార్యద ర్శి,అణగారిన ప్రజల హక్కుల పోరా ట కమిటి అద్యక్షులు గద్దర్ అభి మానుల సంఘం, బంటు వేంకటేష్, కన్వీనర్ ,జజ్జనక కళా మండలి ,అవిలయ్య ,అద్యక్షులు ,తేలంగాణ అంబేద్కర్ యువజన సంఘం పాల్గొన్నారు.

విశ్వ భారతి హై స్కూల్ లో బెస్ట్ అవెలబుల్ స్కూల్ స్కీం ద్వారా ఒకటవ, ఐదవ తరగతులకు దరఖాస్తులు

- బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా విశ్వభారతిలో విద్యార్థులకు ఉచిత విద్య
- షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
-విద్యార్థుల యొక్క భవిష్యత్ మాకు ముఖ్యం
- విశ్వభారతి హై స్కూల్ కరస్పాండెంట్ ఇంజపురి మధు బాబు

కమలాపూర్ మే 30 (మన వార్త ప్రతినిది కళ్యాణ్)
విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే మా లక్ష్యమని విశ్వభారతి హై స్కూల్ కరస్పాండెంట్ ఇంజపురి మధు బాబు అన్నారు. బెస్ట్ అవెలబుల్ స్కూల్ స్కీమ్ కింద ఒకటవ తరగతి మరియు ఐదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చే ఫీజులతో పూర్తిగా ఉచితంగా చదువు చెప్పడం తో పాటు ఐదవ తరగతి విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కూడా ఉందని ఆయన తెలిపారు. కమలాపూర్ మండల కేంద్రం లోని విశ్వ భారతి హై స్కూల్ లో ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ తీసుకుంటామని బెస్ట్ అవెలబుల్ స్కూల్ స్కీమ్ ని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. విశ్వ భారతి హై స్కూల్ విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక , సాంఘిక, సమాజ పరిస్థితులపై అవగాహన కలిగే విధంగా సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. అలాగే విశ్వభారతి హై స్కూల్ లో విద్యార్థి దశనుండే సహాయం చేసే గుణాన్ని పెంపొందించడానికి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కావున ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన విశ్వ భారతి హై స్కూల్ లో బెస్ట్ అవెలబుల్ స్కూల్ స్కీం ద్వారా ఒకటవ, ఐదవ తరగతులకు దరఖాస్తులు తీసుకుంటున్నారని పూర్తి వివరాలకు విశ్వభారతి హై స్కూల్ లో గాని సహాయ సాంఘిక సంక్షేమాధికారి (ఏఎస్డబ్ల్యూ ఓ) ని సంప్రదించాలని ఆయన అన్నారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ గా న్యాయవాది పిల్లి కార్తిక్ ఎన్నిక

కమలాపూర్ మే 30 (మనవార్త ప్రతినిధి కళ్యాణ్)
హన్మకొండ లోని యువ న్యాయవాది పిల్లి కార్తిక్ ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ గా నియమించినట్లు ఉత్తర్వులు జారీచేస్తూ మే 29 రోజు టిపిసిసి లీగల్ సెల్ ఛైర్మన్ గా పొన్నం అశోక్ గౌడ్ నియామక పత్రాన్ని అందించటం జరిగింది. ఈ సందర్బంగా కార్తీక్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని సవినయంగా తెలిపారు. తనను నియమించిన సానియా గాంధీ కి, రాహుల్ గాంధీ కి, మల్లికార్జున్ కార్గే కి, ముఖ్య మంత్రి కి రేవంత్ రెడ్డి కి, పొన్నం అశోక్ గౌడ్ కి ముందుగా ధన్యవాదములు తెలుపుతూ బలరాం నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మంత్రులు కొండా సురేఖ, సీతక్క లకు మరియు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి కి , నాగరాజు కి , రేవూరి ప్రకాష్ రెడ్డి కి , గండ్ర సత్యనారాయణ , దొంతి మాధవ రెడ్డి,కడియం శ్రీహరి యశస్విని రెడ్డి లు మరయు వరంగల్ కాంగ్రెస్ అధ్యక్షురాలుఎర్రబెల్లి స్వర్ణ ల కు ధన్యవాదములు తెలిపారు. దీనికి సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదములు తెలిపారు.కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ గా నియమితులైన కార్తిక్ గారికి కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదులు, న్యాయవాద మిత్రులు, పెద్దలు, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలియజేసారు.

ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు పుట్టినరోజు వేడుకలు..

-రక్తదానం చేసిన అభిమానులు.

జమ్మికుంట, మే 30(మన వార్త ప్రతినిధి): మంత్రి శ్రీధర్ బాబు పుట్టినరోజు వేడుకలు జమ్మికుంట పట్టణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఐటి శాఖ మంత్రి దుద్దీల్ల శ్రీధర్ బాబు పుట్టినరోజు వేడుకలు జమ్మికుంట పట్టణంలో యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సజ్జద్ మహమ్మద్ అధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం స్థానిక స్పందన బ్లడ్ బ్యాంక్ లో18 మంది దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు రావి కంటి రాజు, దిడ్డి రాము, గూడెపు సారంగపాణి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర హయాంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా వున్నప్పుడు మన బియ్యం పథకం ద్వారా తొమ్మిది రకాల సరుకులు రేషన్ లో ప్రజలు అందించారని గుర్తు చేశారు. ప్రజలు చేసిన సేవలను కొనియాడారు.ప్రస్తుతం ఐటి మంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు.ప్రజలకు,యువతకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వుండాలని,మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేశిని కోటి, బొంగోని వీరన్న , మహమ్మద్ రంజాన్, యాట్ల అశోక్, ఎండి సలీం, ముద్దమల్ల రవి, యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తేలకుంట్ల ప్రశాంత్ (సన్నీ),కల్లపల్లి వినోద్, పార్లపల్లి నాగరాజు, మారుతి రెడ్డి, గడ్డం దీక్షిత్, దొడ్డి సదానందం, మొలుగూరి రమేష్, మైస సురేష్, పాతకాల అనిల్ , అజయ్ గౌడ్, రాజు,వాసాల సుధీర్, కుమార్ ,అజయ్, సంజయ్ సాహు,సల్లు బాబా, సోలమన్ రాజ్, అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రత్యేక కులగణన కమిషన్ ఏర్పాటు చేయాలి..

కరీంనగర్, మే 30(మన వార్త ప్రతినిధి): రిజర్వేషన్లు పెంచి బీసీల వాటా బీసీలకు దక్కాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాల లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ మరియు జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంపు భవిష్యత్తు కార్యాచరణ సెమినార్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కుల గణన విషయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేరుస్తారనె ఇప్పటికీ నమ్ముతున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పరిపాలనలో బీసీ కులాల లెక్కలు తీయకుండా బీసీ రిజర్వేషన్లు తగ్గించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలను రాజకీయంగా గొంతు కోశారని, బిసి కులగనణ నిర్వహించి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడమే కాకుండా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎన్నికల బహిరంగ సభలలో అదేవిధంగా, స్వయంగా బీసీ సంఘాలకు హామి ఇవ్వడంతో బీసీలు విశ్వసించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి విశేషంగా కృషి చేశారని ఆయన తెలిపారు.బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ లు మాట్లాడుతూ శాస్త్రీయమైన కుల గణన ద్వారానే భవిష్యత్తులో ఎలాంటి న్యాపరమైన వివాదాలు రాకుండా బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉంటుంది అని కులగనన లేకుండా ఇతర మార్గాల ద్వారా బీసీ రిజర్వేషన్లు పెంచడం సాధ్యం కాదని ఆయన అన్నారు. బిహార్ రాష్ట్ర తరాహాలోననే తెలంగాణ రాష్ట్రంలో కూడా కులగనణ చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. బీసీ కులగనణ సాధించడానికి ప్రభుత్వం మీద పార్టీలకతీతంగా బీసీ సంఘాలు కుల సంఘాలు జేఏసీగా ఏర్పడి పోరాడాలన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగా శ్రీనివాస్ ,బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారొజు రాకేష్ చారి,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిఎస్ ఆనంద్,రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్,, వివిధ జిల్లాల అధ్యక్షులు బ్రహ్మండబేరి నరేష్ ,నల్లవెల్లి ,శంకర్, మల్లేష్ యాదవ్,గాజుల నాగరాజు ,ఐల ప్రసన్న,అరుణ,జలజ,తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసింది...

-ఆరుగ్యరంటిల అమలుకు రేవంత్ రెడ్డి కాలయాపన..

-జడ్పిటిసి,డాక్టర్.శ్రీరామ్ శ్యామ్.

జమ్మికుంట, మే 30(మన వార్త ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా కాంగ్రెస్ పాలన ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందని ప్రజలు భావించిన తెలంగాణ రేవంత్ రెడ్డి పాలన మొండి చేయి చూపిస్తుందని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలల గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో రూపొందించిన ఏఒక్క అంశం కార్యచరణ దాల్చలేదని ఆరోపించారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప, మరి ఏదీ కార్యచరణ దాల్చలేదని గుర్తు చేశారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం రోడ్డు రవాణాకు వాహనాలకు సంబంధించిన టీఎస్ నుండి టీజీ మార్చడం తప్ప వారు చేసింది ఏది లేదని, దీనివల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ అధికారం ముద్ర ఏర్పాటు చేసిన పది సంవత్సరాలు అయినప్పటికీ ఎవరు కూడా దానిపైన అభ్యంతరం చేయలేదు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని రాజముద్రలో మార్పులు చేయడం ఒక సిగ్గుమాలిన చర్య అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాలయాపన చేయడానికి ఇవి ఒక కారణాలుగా చూపించి సమయాన్ని వృధా చేయడం తప్ప ప్రజలకు ఒరగపెట్టింది ఏమీ లేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల కోడ్ అనంతరం ప్రజా సమస్యల పైన నిరంతరం పాలన చేయాలని డిమాండ్ చేశారు. వర్షా కాలం సీజన్ రాబోతున్న సందర్భంలో రైతులకు విత్తనాలు,ఎరువుల కొరత రాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలన కూడా తెలంగాణ ద్రోహులు చెప్పిన విధంగానే పనిచేస్తుందని చెప్పారు. రేవంత్ రెడ్డి పాలన తుగ్లక్ పాలనను తలపిస్తుందని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి..

-బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహరావు

వేములవాడ మే 30 (మన వార్తా ప్రతినిధి) చందుర్తి మండలం లోని మల్యాల గ్రామంలో జరిగిన క్రికెట్ ప్రీమియం లీగ్ సీజన్-1 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. యువత చెడు అలవాటులకు బానిస కాకుండా, క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసంతో పెంపొందుతుందన్నారు. అనంతరం గెలుపొందిన కోనరావుపేట జట్టుకు టోర్నీ నిర్వహకులు రాజు, లక్ష్మీనారాయణ లో లక్ష్మీనరసింహరావు చేతుల మీదుగా విన్నర్ ప్రైజ్ మనీ గా 20వేల రూపాయలు, కప్ ను అందజేశారు. రన్నరప్ గా నిలిచిన మల్యాల జట్టుకు 10వేల రూపాయల ప్రైజ్ మనీ అందజేశారు. దాదాపు నెల రోజుల నుండి జరుగుతున్న ఈ టోర్నీ లో 45 జట్లు పాల్గొనగా విజేతగా కోనరావుపేట మండల జట్టు, రన్నరప్ గా మల్యాల జట్టు నిలిచిందని టోర్నీ నిర్వాహకులు ఈర్లపల్లి రాజు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు ప్రోత్సాహక బహుమతులు అందించిన ఈర్లపల్లి రాజును, గట్టు లక్ష్మీనారాయణ ను లక్ష్మీనరసింహారావు గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, వైస్ ఎంపీపీ అబ్రహం, ఎంపీటీసీ రమేష్ రావు, ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సీనియర్ నాయకులు రమేష్, శ్రీనివాస్, కమలాకర్, రవి, కౌన్సిలర్ సిరిగిరి రామ్ చందర్, తదితరులు ఉన్నారు.

శ్రీధర్ బాబు పుట్టినరోజు సంధర్భంగా అన్నదానం..

జమ్మికుంట, మే 30(మన వార్త ప్రతినిధి): మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పుట్టినరోజు సంధర్భంగా బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్ బాబు రాబోయే రోజులలో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారికి ఆయురారోగ్యాలు దేవుడు ఇవ్వాలని శివాలయంలో పూజలు చేసినట్లు చెప్పారు .ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి రాజేశ్వరరావు, దేశిని కోటే, రాచపల్లి రమేష్, మొలుగూరి పద్మావతి, కౌన్సిలర్ వీరన్న గౌడ్, బుర్ర కుమార్ గౌడ్, దొగ్గల భాస్కర్ ,తిరుపతి, శ్రీనివాసు, గుల్లి జపాన్, మొలుగూరి సతీష్ ,చాంద్ పాషా, పోతిరెడ్డి మల్లయ్య, మాధవరావు, శ్రీనివాసు,రాచపల్లి శ్రీనివాస్ ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి..

జమ్మికుంట, మే 30(మన వార్త ప్రతినిధి): విలాసాగర్ గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి సందర్శించారు.జమ్మికుంట మండలం పరిధిలోని విలాసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయం తో పాటు గ్రామపంచాయతీ చేసిన అభివృద్ధి పనులను జిల్లా పంచాయతీ అధికారి ఏ రవీందర్ గురువారం సందర్శించారు. స్థానిక ఎంపీవో సతీష్ కుమార్ విలాసాగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మనోహర్ రెడ్డి తో కలిసి గ్రామంలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం,కంపోస్టు షెడ్,వైకుంఠ ధామం,నర్సరీ, క్రీడా ప్రాంగణాల ను జిల్లా పంచాయతీ అధికారి తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పనులను పంచాయతీ అధికారి పరిశీలించి పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసినట్టు ఎంపీవో సతీష్ కుమార్ తెలిపారు.

రాజన్న సేవలో డాక్టర్ కిరణ్ కుమార్

వేములవాడ మే 30 (మన వార్త ప్రతినిధి)

వేములవాడ, మే 30, న్యూస్ : దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని గురువారం కరీంనగర్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హాస్పిటల్ క్యాస్ట్రో ఇంట్రాలజిస్ట్ డాక్టర్. కిరణ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా గర్భాలయంలో కొలువుదీరిన స్వామివార్లకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వారికి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందజేసి వేదోక్త ఆశీర్వచనం చేయగా ప్రముఖ వ్యాపారవేత్త,పాత్రికేయుడు కటుకం శ్రీనివాస్ రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

చందుర్తి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్..

వేములవాడ, మే 30 (మన వార్త ప్రతినిధి నందు రావు): చందుర్తి పోలీస్ స్టేషన్ ను గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మిక తనిఖీ చేసి పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణపై లోతుగా పరిశీలించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర రికార్డును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.మారుతున్న నేరాల నమూనాకు అనుగుణంగా గస్తీ, పేట్రోలింగ్ లను పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్లలో క్రైమ్ పాట్రాన్స్, ఫంక్షనల్ వర్టికాల్స్ పనితీరు పరిశీలించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24గం.ల గస్తీ నిర్వహించాలని,సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందరి దగ్గర ఉండాలని,గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ వేముకటేశ్వర్లు, ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది అన్నారు.

హరిహర వీరమల్లు వచ్చేది అప్పుడేనా..?

మన వార్త తెలుగు సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్న నటుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. మెగాస్టార్ తమ్ముడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈయన చాలా తక్కువ సమయం లోనే మంచి సినిమాలు చేసి తనను తాను చాలా ప్రత్యేకంగా నిలుపుకోవడమే కాకుండా ఆయన మేనరిజమ్స్ తో తెలుగు ప్రేక్షకులందర్నీ మైమరిపింపజేశాడు. చిరంజీవి తమ్ముడిగా ఎదగడమే కాకుండా చిరంజీవికి మించిన ఫ్యాన్ ఫాలోయింగ్ ని కూడా సంపాదించుకున్నాడు. ఇక ప్రస్తుతం జనసేన పార్టీ పెట్టి పాలిటిక్స్ లో చాలా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నప్పటికి ఆ పార్టీని నడపడానికి ఫండ్స్ కావాలి కాబట్టి సినిమాలను మాత్రం వదలకుండా సంవత్సరానికి ఒక సినిమాని అయిన రిలీజ్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతున్నాడు. ఇక ఇలాంటి క్రమంలోనే ఆయన చేస్తున్న మూడు సినిమాలు సెట్స్ మీద ఉన్నాయి. అందులో ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్, హరిహర వీరమల్లు సినిమాల గురించి మనం ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. ఇందులో ఓజీ సినిమా సెప్టెంబర్ 27వ తేదీన రిలీజ్ చేస్తున్నామంటూ సినిమా యూనిట్ అయితే అనౌన్స్ మెంట్ ఇచ్చినప్పటికీ ఆ షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది అనే దానిమీద ఇంకా క్లారిటీ రావడం లేదు.అయితే ఈ సినిమాని అనుకున్న టైమ్ కి కనక రిలీజ్ చేసినట్లైతే హరిహర వీరమల్లు సినిమాని ఈ ఇయర్ ఎండింగ్ లో గాని 2025 స్టార్టింగ్ లో గాని రిలీజ్ చేసే అవకాశాలైతే ఉన్నాయి. ఇక ఇప్పటికే ఈ సినిమాని స్టార్ట్ చేసి దాదాపు నాలుగు సంవత్సరాలు అవుతుంది. కాబట్టి పవన్ కళ్యాణ్ అభిమానుల్లో కూడా ఈ సినిమా గురించి ఎదురు చూసి ఓపిక నశించిపోతుంది.

విజయ్ ఆంటోని షాకింగ్ కామెంట్స్!

కోలీవుడ్ హీరో, డైరెక్టర్ విజయ్ ఆంటోనీ షాకింగ్ కామెంట్స్ చేశారు. దాదాపుగా మూడు నెలల నుంచి తాను చెప్పులు లేకుండానే తిరుగుతున్నానని, భవిష్యత్‌లో కూడా చెప్పులు వేసుకోను అని చెప్పారు.చెప్పులు వేసుకోకపోవడానికి ప్రత్యేకమైన కారణం ఏమీ లేదని తెలిపారు. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ పతాకంపై కమల్ బోరా, డి లలితా, బి ప్రదీప్, పంకజ్ బోరా సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్ బుధవారం విడుదల అయింది. తుఫాన్ టీజర్ విడుదల కార్యక్రమంకు విజయ్ అంటోని చెప్పులు లేకుండా వచ్చారు. దాంతో మీరు ఏదైనా దీక్షలో ఉన్నారా? అని మీడియా ప్రశ్నించగా.. అసలు విషయం చెప్పారు. 'నేను ఏ దీక్షలో లేను. దాదాపుగా 3 నెలల నుంచి చెప్పులు లేకుండానే తిరుగుతున్నాను. ఒకరోజు నేను చెప్పులు లేకుండా నడిచాను. అప్పుడు నాకు బాగా అనిపించింది. చాలా ప్రశాంతంగా ఉంది. ఆరోగ్యానికి కూడా మంచిదే కాకుండా కాన్ఫిడెన్స్‌ను పెంచుతుంది. చెప్పులు లేకుండా తిరగడం ప్రారంభినప్పటినుంచి నేను ఎలాంటి ఒత్తిడికి గురి కాలేదు. అందుకే జీవితాంతం చెప్పులు లేకుండా ఉండాలనుకుంటున్నా' అని విజయ్ అంటోని చెప్పారు. చెప్పులు లేకుండా నడవడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదని పలు నివేదకలు పేర్కొన్న విషయం తెలిసిందే.

ప్రైవేటు విద్యాసంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

జమ్మికుంట, మే 30(మన వార్త ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్య వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని, సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకొని ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ఎన్నికల హామీలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు అన్నారు. ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలను ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలను గుర్తించి సీజ్ చేయాలని అలాగే ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి (ఏఐఎస్ఎఫ్) పక్షాన డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడి అరికట్టే విధంగా ఫ్రీజర్ నియంతను చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగా బలోపేతానికి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సంక్షేమ హాస్టళ్లు, యూనివర్సిటీలలో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ చేసి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు పెరిగేల కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విద్యార్థులకు,యువకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విద్యార్థులకు ఇస్తామన్న ఎలక్ట్రిక్ స్కూటిలు, ల్యాప్ టాప్స్, మండలానికో ఇంటర్నేషనల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని విద్యార్థులకు ప్రభుత్వ విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలని, ఫీజుల పేరిట ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడిని అరికట్టాలని , ప్రభుత్వం విద్యాశాఖ ఫీజులు నియంత్రణకి కఠిన చట్టాలు అమలు చేసి నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని లద్దునూరి విష్ణు డిమాండ్ చేశారు.

జట్టు కూర్పులో రోహిత్‌కు తలపోటు

WORLD CUP
ICC T20 WORLD CUP
2024
VIRAT
ROHIT

మన వార్త మరో నాలుగు రోజుల్లో మహా సమరం ప్రారంభం కానుంది. జూన్ 2న నుంచి మొదలయ్యే టీ20 వరల్డ్ కప్‌కు అమెరికా-వెస్టిండీస్ ఉమ్మడిగా ఆతిథ్యం ఇస్తున్నాయి. వన్డే వరల్డ్ కప్‌ను తృటిలో చేజార్చుకున్న భారత్ పొట్టి ప్రపంచకప్‌లో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ సారి కప్‌ను ముద్దాడాలని పక్కా ప్రణాళికలతో యూఎస్‌ఏలో అడుగుపెట్టింది. అయితే ప్రత్యర్థితో కంటే జట్టు కూర్పుతోనే భారత్ ఎక్కువగా పోరాడాల్సిన పరిస్థితి తలెత్తింది. గాయాల నుంచి కోలుకుని రిషభ్ పంత్, హార్దిక్ పాండ్య తిరిగి రావడంతో జట్టు బలోపేతంగా మారడంతో పాటు గందరగోళంగా ఏర్పడింది. అంతేగాక ప్రపంచకప్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో కొందరు ఫామ్‌లేమితో ఉన్నారు. అలాగే రెండు నెలలు పాటు ఆటగాళ్లు అవిరామంగా క్రికెట్ ఆడారు. మెగా టోర్నీకి ఇది మంచి సన్నాహకంగానే ఉంటుంది. కానీ టీమిండియాలో ఆడే స్థానాల్లో ఫ్రాంచైజీల తరపున మన ఆటగాళ్లు ఆడలేదు. వన్‌డౌన్‌లో వచ్చే విరాట్ కోహ్లి ఆర్సీబీ తరపున ఓపెనర్‌గా వచ్చాడు. మిడిలార్డర్‌లో ఆడాల్సిన సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇక సీఎస్కే తరపున శివమ్ దూబె నాలుగో స్థానంలో ఆడాడు. కానీ భారత జట్టులో వాళ్ల ఆడే స్థానాలు భిన్నంగా ఉన్నాయి. మరోవైపు దూబె, సూర్యకుమార్ యాదవ్, యశస్వీ జైస్వాల్, హార్దిక్ పాండ్య ఫామ్‌లో లేకపోవడం టీమిండియాను తీవ్రంగా కలవరపెడుతోంది. అయితే ఫామ్ లేకపోయినప్పటికీ ఈ ఆటగాళ్లకు గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌ల వరకు అవకాశం ఇవ్వాలని టీమ్ మేనేజ్మెంట్ ఆలోచిస్తోంది. భారత్ గ్రూప్ దశ నుంచి సూపర్-8కు అర్హత సాధించడం కష్టతరమేమి కాదు. దీంతో గ్రూప్ స్టేజ్‌లోనే జట్టు కూర్పును సిద్ధం చేసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సంజు శాంసన్, అక్షర్ పటేల్, యుజువేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్‌లను కొన్ని మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితం చేయాలని ప్లాన్ చేస్తోంది. తుదిజట్టులో సెలక్ట్ అయ్యే మిగిలిన ఆటగాళ్లు అట్టర్ ఫ్లాప్ అయితే సూపర్-8లో ఈ నలుగురికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. కాగా, గ్రూప్-ఏలో భారత్‌తో పాటు పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, ఆతిథ్య జట్టు అమెరికా ఉన్నాయి. న్యూయార్క్ వేదికగా జూన్ 5న ఐర్లాండ్‌తో టీమిండియా తమ తొలి మ్యాచ్ ఆడనుంది.

ఇంట్రెస్టింగ్ విషయం చెప్పిన రష్మిక?

మన వార్త చలో అనే సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చిన రష్మిక మందన.. తన నటనతో ఎంతలా ప్రేక్షకులను ఆకట్టుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.తన అందం అభినయంతో తెలుగు పరీక్షకులందరికీ ఫేవరెట్ హీరోయిన్గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. అంతేకాదు అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్గా ఎదిగింది. ఇక నేషనల్ క్రష్ అనే ఒక ప్రత్యేకమైన బిరుదును కూడా సొంతం చేసుకుంది అని చెప్పాలి. ఇక ఇప్పుడు ఏకంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపును సంపాదించుకొని వరుసగా సినిమాలు చేస్తుంది ఈ ముద్దుగుమ్మ. ఈ క్రమంలోనే ప్రస్తుతం ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పుష్ప 2 సినిమాలో నటిస్తోంది అన్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై భారీ రేంజ్ లోనే అంచనాలు ఉన్నాయి. ఇక బాలీవుడ్ లో కూడా వరుసగా అవకాశాలు అందుకుంటూ అక్కడ బిజీ హీరోయిన్ గానే కొనసాగుతోంది. తెలుగు తమిళ కన్నడ భాషలో అయితే వరుస అవకాశాలను అందుకుంటుంది అని చెప్పాలి. అయితే సాధారణంగా హీరోయిన్లు ఏదైనా సినిమా ఈవెంట్ కు వచ్చినప్పుడు ఎక్కువగా ఇంగ్లీష్ లోనే మాట్లాడటం చూస్తూ ఉంటాం. కానీ రష్మిక మంత్రం ఇలా సినిమా ఈవెంట్ లలో తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. అయితే ఇలా రష్మిక ఎందుకు తెలుగులో మాట్లాడుతుంది అన్న విషయాన్ని చెప్పుకొచ్చింది హీరోయిన్. చాలా మంది నేను వారి భాషలో మాట్లాడాలని కోరుకుంటారు. అందుకే నాకు భాష రాకపోయినా మాట్లాడేందుకు ప్రయత్నిస్తా. ఇంగ్లీష్ మాట్లాడి వారిని అగౌరపరచాలని అస్సలు అనుకోను చెప్పుకొచ్చింది.

ఇండస్ట్రీనుంచి పంపించేస్తామన్నారు

"నిజాయతీగా పని చేసి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' లాంటి మంచి సినిమా తీశాం. అందుకే ఈ మూవీపై చాలా నమ్మకంగా ఉన్నాం. అందరూ కుటుంబంతో కలిసి రావొచ్చు.సినిమా చూశాక రెండు మూడు రోజుల పాటు ప్రేక్షకుల మనసుల్లోనే ఉంటుంది" అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా, నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది.ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ప్రీ రిలీజ్ వేడుకలో హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ- "ఐదేళ్ల క్రితం మార్చి 31వ తేదీనే నా 'ఫలక్‌నుమా దాస్' రిలీజ్ అయ్యింది. నేనీ స్థాయిలో ఉన్నానంటే కారణం ఆ సినిమా.. ఆదరించిన ప్రేక్షకులే. నా కెరీర్ ఆరంభంలో 'ఇలాంటి యాటిట్యూడ్ ఇండస్ట్రీలో పనికి రాదు.. తొక్కేస్తారు.. పంపించేస్తారు' అన్నారు. అయినా నా క్యారెక్టర్ మార్చుకోలేదు. ఐదేళ్లుగా నన్ను సపోర్ట్ చేస్తున్న ఇండస్ట్రీకి, దర్శక-నిర్మాతలకు, ముఖ్యంగా నా ఫ్యాన్స్‌కి థ్యాంక్స్. ఇప్పటికే ఐదేళ్లు గడిచిపోయాయి. మరో ఐదేళ్లు ఫైనల్.. కాల్చిపడేస్తా మొత్తం. రత్నలాంటి పాత్ర చేయాలన్నది నా కల. అలాంటి కథతో వచ్చిన కృష్ణ చైతన్యకి థ్యాంక్స్. నేను ఇప్పటి వరకూ పనిచేసిన నిర్మాతల్లో నాగవంశీ బెస్ట్" అన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ- "మా అమ్మానాన్నల ఆశీస్సుల వల్లే ఇక్కడ ఉన్నాను. మా గురువు త్రివిక్రమ్‌గారే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'కి మూలం. ఆయన వల్లే ఈ సినిమా మొదలైంది. నన్ను నమ్మి ఈ సినిమా తీసిన నిర్మాతలు చినబాబు, నాగవంశీ, సాయి సౌజన్యగార్లకు కృతజ్ఞతలు. బుజ్జిగా నేహాశెట్టి, రత్నమాలగా అంజలి పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి.

ఆలుగడ్డ ప్రయోజనాలు



మన వార్త ఏదైనా చిన్న ఫంక్షన్ అయినా పెద్ద ఫంక్షన్ అయినా కూరగాయల భోజనాల్లో ఆలుకర్రీ కచ్చితంగా ఉంటుంది. ఈ బంగాళదుంపకు ఫ్యాన్స్ ఎక్కువే ఉంటారు. బంగాళ దుంపలతో ఎలాంటి వంటలు అయినా వండవచ్చు.కూరలు, ఫ్రైలు ఏది వండినా సరే చాలా రుచిగా ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఎక్కువగా ఉపయోగించే వాటిల్లో బంగాళ దుంప ముందు వరుసలో ఉంటుంది. ఏ కాలంలో అయినా అతిగా ఇష్టపడి తినే వంటకం కూడా ఆలునే. మరి దీన్ని తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఓ సారి చూసేద్దాం. బంగాళ దుంపల్లో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయి అంటున్నారు నిపుణులు. పొటాషియం, విటమిన్ సి, డైటరీ, ఫైబర్‌లు పుష్కలంగా ఉంటాయట. ఆలూ తినడం వల్ల గుండె జబ్బులు, సడన్ డెత్ లు వచ్చే ఛాన్సులు చాలా తక్కువగా ఉంటుందని తేలిందట. ఈ దుంపలో అధిక మొత్తంలో ఫైబర్ కంటెంట్ అనేది ఉంటుంది కాబట్టి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని కంట్రోల్ చేస్తుంది. అంటే చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తే గుండె సమస్యలకు చెక్ పెట్టవచ్చు అన్నమాట.గుండె సంబంధిత సమస్యలతో బాధ పడేవారు రెగ్యులర్‌గా ఆలు గడ్డ తినడం వల్ల హార్ట్ సమస్యలు కొంత వరకు తక్కువ అవుతాయట. ఈ దుంపలో ఫైబర్ మాత్రమే కాదు కార్బోహైడ్రేట్లు, విటమిన్లు కూడా లభిస్తాయి. అవి శరీరానికి తక్షణ శక్తి ని అందిస్తాయి. ఆలు గడ్డలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థ ను చక్కగా పని చేసేలా చేస్తుంది. దీంతో మల బద్ధకం, అజీర్తి వంటి సమస్యలు దూరం అవుతాయి. బంగాళ దుంపలు తినడం వల్ల చర్మం సమస్యలు కూడా రావు అంటున్నారు నిపుణులు. చర్మ సంరక్షణలోనూ బంగాళ దుంప మంచి పాత్ర పోషిస్తుందట.

పసికూనపై ఆసీస్ ఘన విజయం

మన వార్త టీ20 వరల్డ్‌కప్ 2024 వార్మప్ మ్యాచ్‌ల్లో భాగంగా నమీబియాతో నిన్న (మే 28) జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేయగా..ఆస్ట్రేలియా కేవలం 10 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆసీస్ తరఫున తొలుత హాజిల్‌వుడ్.. ఆతర్వాత డేవిడ్ వార్నర్ రెచ్చిపోయారు. హాజిల్‌వుడ్ నాలుగు ఓవర్లు బౌల్ చేసి కేవలం 5 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టగా.. వార్నర్ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో అజేయమైన 54 పరుగులు చేశాడు. హాజిల్‌వుడ్ తన నాలుగు ఓవర్ల స్పెల్‌లో ఏకంగా మూడు మెయిడిన్ ఓవర్లు వేయడం విశేషం. హాజిల్‌వుడ్‌తో పాటు ఆడమ్ జంపా (4-0-25-3), నాథన్ ఇల్లిస్ (4-0-17-1), టిమ్ డేవిడ్ (4-0-39-1) కూడా సత్తా చాటడంతో పసికూన నమీబియా విలవిలలాడిపోయింది. నమీబియా ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ జేన్ గ్రీన్ (38) ఓ మోస్తరు స్కోర్ చేయగా.. మిగతా ఆటగాళ్లంతా విఫలమయ్యారు. స్వల్ప లక్ష్య ఛేదనలో ఆసీస్ ఆడుతూపాడుతూ విజయతీరాలకు చేరింది. కెప్టెన్ మార్ష్ 18, ఇంగ్లిస్ 5, టిమ్ డేవిడ్ 23, వేడ్ 12 (నాటౌట్) పరుగులు చేశారు. నమీబియా బౌలర్లలో బెర్నల్డ్ స్కోల్జ్‌కు రెండు వికెట్లు దక్కగా.. మార్ష్ రనౌటయ్యాడు.